



నగరోత్సవంలో కలశాలతో భక్తులు

చిన్నారుల వేషధారణ





దర్శనమిస్తున్న వాసవీమాత

వైభవం.. వాసవీమాత నగరోత్సవం



అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4: వాసవీ దీక్షా మండల కాలాన్ని పురస్కరించుకుని వాసవీ దీక్షాసమితి, పాతూరు ఆర్యవైశ్య సంఘం సంయుక్తాధ్వర్యంలో ఆదివారం వాసవీమాత నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో నవ కుండి హోమం, కన్యకపూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో వాసవీమాత ఉత్సవమూర్తిని ఆశీనులు గావించి, పాతూరు వీధుల్లో ఊరేగించారు. మహామంగళహారతి అనంతరం వాసవీ దీక్షధారులకు భిక్షను అందజేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున ఆర్యవైశ్యులు, దీక్షధారులు, మాలధారులు పాల్గొన్నారు.



పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో చెరకు గడలు, పైనాపిల్‌తో అలంకరణ

నవ్విపోదురుగాక..!

శిక్షణ పేరిట నిధుల దుబారా...

ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై ఇప్పటికే టీచర్లకు శిక్షణ

రెండేళ్ల కిందట ఇచ్చిన ట్యాబ్స్‌తో రప్పాడేస్తున్న విద్యార్థులు

వాటిపై మళ్లీ శిక్షణ ఇచ్చేందుకు సర్కారు నిర్ణయం

సెలవుల ముందు డబ్బు వృథాపై విమర్శలు

విద్యార్థులు రెండేళ్ల కిందట ఇచ్చిన ట్యాబ్స్‌ను రఫాడిస్తున్నారు. ఎడాపెడా వినియోగిస్తున్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై ఇప్పటికే టీచర్లకు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ ట్యాబ్స్, ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై టీచర్లు, విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యార్థులతో శిక్షణ ఇస్తాం అంటూ విద్యాశాఖ ముందుకెళ్లడంపై దుమారం రేగుతోంది. నవ్విపోదురుగాక.. అన్న చందంగా ప్రభుత్వ తీరు ఉందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్' పేరులో ఇంజనీరింగ్ విద్యార్థులకు నెలకు రూ.12 వేలు రెమ్యూనరేషన్ ఇచ్చి.. స్కూళ్లలో వారితో ట్యాబ్స్, ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీలపై శిక్షణ ఇప్పించేందుకు సిద్ధమయ్యారు. స్కూళ్లల్లో బోర్డుపై రాసేందుకు శుద్ధముక్కలకు డబ్బుల్లేక టీచర్లు తలలు పట్టుకుంటున్నారు. చాలా ట్యాబ్స్‌ను విద్యార్థులు ధ్వంసం చేసేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాశాఖ చేస్తున్న ప్రజాధనం దుబారాపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అనంతపురం విద్య



జేఎన్టీయూలో ఐఎఫ్‌పీ ప్యానల్స్ శిక్షణకు వచ్చిన టీచర్లు (ఫైల్)





ఐఎఫ్‌పీ ప్యానల్

ట్యాబ్స్... టీవీలు, ప్యానల్స్ ఇలా...

జిల్లావ్యాప్తంగా స్కూళ్లకు పెద్దఎత్తున ట్యాబ్స్, స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ మంజూరైనట్లు, పంపిణీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. 2022-23 ఏడాదిలో 8వ తరగతి విద్యార్థులకు 21,517, టీచర్లకు 3952 ట్యాబ్‌లు, 2023-24కి మరో 22,640 మంజూరైనట్లు చెబుతున్నారు. ఈ రెండేళ్లలో జిల్లాలోని టీచర్లు, విద్యార్థుల కోసం 48,109 ట్యాబ్‌లు మంజూరైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 31 మండలాల్లో 534 స్కూళ్లకు స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ సరఫరా చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 534 స్కూళ్లకు రెండు విడతలుగా 3,239 ఐఎఫ్‌పీ ప్యానల్స్, 1757 స్మార్ట్ టీవీలు పంపిణీ చేశారు.

స్కూళ్లు ముగిసే వేళ.. ఎలా..?

'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్'గా ఇంజనీరింగ్ కాలేజీల్లో బీటెక్ ఫైనలియర్ చదివే విద్యార్థులు, ఎంటెక్ ఫైనలియర్ వారిని తీసుకుంటారు. సుమారు 4 నెలలు స్కూళ్లలోని డిజిటల్ పరికరాల (ట్యాబ్స్, ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీ)పై శిక్షణ ఇవ్వాలని చూస్తున్నారు. ఒక్కో విద్యార్థికి 3 స్కూళ్ల చొప్పున అప్పగించి, శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 300 స్కూళ్లకుగాను 103 మంది విద్యార్థులకు ఈ బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్‌గా వ్యవహరించినందుకుగాను విద్యార్థికి నెలకు రూ.12వేలు పారితోషకం ఇవ్వాలన్నది సర్కారు ఆలోచన. ఇప్పటికే ఫిబ్రవరి నెల మొదటి వారం వచ్చింది. మరో రెండు నెలల్లో వేసవి సెలవులు వస్తాయి. స్కూళ్ల రీ ఓపెన్ సమయంలో కాకుండా... అకడమిక్ ఇయర్ ముగిసే వేళ ఇలా శిక్షణ అంటూ ప్రభుత్వం హడావుడి చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకూ స్కూళ్లలో ఎలాంటి గ్రాంట్స్ ఇవ్వలేదనీ, శుద్ధముక్కలు, పేపర్లు, ఇతర స్టేషనరీకి సైతం నిధుల్లేక అల్లాడుతున్నారు. 500 మంది, 800 మంది, వెయ్యి మంది విద్యార్థులున్న స్కూళ్లు కూడా ఉన్నాయి. ఇలాంటి స్కూళ్లలో స్టేషనరీ ఇతర ఖరులు ప్రధానోపాధ్యాయుల నెత్తిన పడుతున్నాయి. స్కూళ్ల నిర్వహణకు డబ్బు ఇవ్వకుండా ప్రభుత్వం ఇప్పటికే వాడుకలో ఉన్న పరికరాలపై మళ్లీ శిక్షణ ఇవ్వడం ఏంటి..? ఈ దుబారా అవసరమా.. అంటూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే శిక్షణ పూర్తి...

ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై ఇప్పటికే జిల్లావ్యాప్తంగా టీచర్లకు శిక్షణ ఇచ్చారు. గతేడాది జులైలో రెండు రోజులపాటు టీచర్లకు శిక్షణ అందించారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను స్కూళ్లలో ఎలా వినియోగించాలో నన్న దానిపై నిపుణుల ఆధ్వర్యంలో జేఎన్టీయూలో స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్స్‌ను ఇప్పటికే వారు వాడేస్తున్నారు. రెండేళ్ల కిందట ఇచ్చిన ట్యాబ్స్‌లో చాలా వరకూ రిపేర్లకు వచ్చిన కొన్ని, పూర్తిగా ధ్వంసమైనవి కూడా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు, టీచర్లకు మళ్లీ ట్యాబ్స్, ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై శిక్షణ అవసరం లేదు. ప్రభుత్వం 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్' అంటూ ఇంజనీరింగ్ విద్యార్థులతో ట్రైనింగ్ ఇప్పించాలనుకోవడంపై మెజార్టీ ఉపాధ్యాయుల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి నాయకులు.. సర్కారు నిర్ణయంపై మండిపడుతున్నారు.

ఏడాది చివరలో సరికాదు



ఐఎఫ్‌బీ ప్యానల్స్ వినియోగంపై ఇప్పటికే టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు విద్యా ఏడాది చివరలో ఇంజనీరింగ్ విద్యార్థులతో డిజిటల్ పరికరాల వాడకంపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదు. పరీక్షల సమయంలో ఇది సరికాదు. ఇది ముమ్మాటికీ నిధుల దుబారానే. స్కూళ్లకు ఇతర నిర్వహణ నిధులు ఇవ్వడం ప్రస్తుతం చాలా అవసరం కూడా.

- రవీంద్ర, ఏపీ గిరిజన ఉపాధ్యాయ సంఘం, జిల్లా ప్రధానకార్యదర్శి

ప్రజాధనం వృథా..



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ పరికరాలు కొంత వరకూ స్కూళ్లలో ఉపయోగపడుతున్నాయి. బోధనలో వినూత్నంగా అందించడానికి అవకాశం ఉంటుంది. ఐఎఫ్‌పీ ప్యానల్స్ వినియోగంపై గత జులైలో టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ శిక్షణ పేరుతో ప్రజాధనం వృథా చేయడం అనవసరం.

- బండారు శంకర్, ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి

నిధుల దుబారాను ఖండిస్తున్నాం



ఏడాదిన్నర కిందట ఇచ్చిన ట్యాబ్స్‌పై ఇప్పుడు టీచర్లు, విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తామనడం హాస్యాస్పదంగా ఉంది. చాలా స్కూళ్లలో పాఠశాల నిర్వహణకు నిధుల్లేక హెచ్‌ఎంలు, టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. వారి జేబులకు చిల్లు పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నిర్ణయం నిధుల దుబారానే. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

- సురేష్‌యాదవ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి

జోరుగా జీరో..!

జిల్లా మీదుగా వక్కల రవాణా

బ్రోకర్ అవతారమెత్తిన పన్నుల శాఖ అధికారి

ప్రైవేట్ అకౌంటెంట్ ద్వారా ముడుపులు

జగనన్న కాలనీలకంటూ గ్రానైట్ అక్రమ రవాణా

వేబిల్లు అడిగితే మైన్స్, వైసీపీ నేతల నుంచి ఫోన్లు

జీరో బిజినెస్‌కు రైట్ రైట్



పన్నుల శాఖ కార్యాలయం



కేంద్ర జీఎస్టీ అధికారులు స్వాధీనం చేసుకున్న సిగరెట్ బండిళ్లు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 4: సరుకు డిమాండ్‌ను బట్టి ఆదాయంతోపాటు అక్రమాలకు తెరలేపుతున్నారు. క్వింటాళ్ల నుంచి టన్నుల కొద్దీ సరఫరా చేస్తూ జీరో బిజినెస్‌కు పాల్పడుతున్నారు. ప్రభుత్వానికి వస్తుసేవల పన్ను (జీఎస్టీ) రూపంలో చెల్లించాల్సిన టాక్స్‌కు గండి కొడుతూ జేబులు నింపుకుంటున్నారు. ఇలాంటి అక్రమార్కులకు సంబంధిత అధికారులు వంత పాడుతుండటంతో వారి అక్రమ వ్యాపారం మూడు పూలు...ఆరు లారీలుగా వర్ధిల్లుతోంది. ముడుపులు పుచ్చుకుంటున్న అధికారులు బిల్లుల్లేని అక్రమ రవాణా వాహనాలకు రైట్ రైట్ అని చెబుతూ... అవినీతికి ఆజ్యం పోస్తున్నారు. గతనెల 14న కేంద్ర జీఎస్టీ విభాగ అధికారులు తపోవనం సర్కిల్‌లో బిల్లుల్లేకుండా వెళ్తున్న లారీని తనిఖీ చేసి వివిధ బ్రాండ్లకు చెందిన రూ.2.35 కోట్ల విలువైన రూ.40.68 లక్షల స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే శాఖ అధికారులు ఈనెల 2వతేదీ మరూరు టోల్‌గేట్ వద్ద బెంగళూరు వెళ్తున్న వాహనాన్ని ఆపి, బిల్లులులేని రూ.3.48కోట్ల విలువైన రూ.56.10 లక్షల సిగరెట్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇలా ఒకటి రెండు కాదు ఎన్నో వస్తువులు అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారు. కొందరు తనిఖీలలో పట్టుకుంటుంటే కొందరు ఆమ్యామ్యాలు పుచ్చుకుని వదిలేస్తున్నారు. గూడ్స్ సర్వీస్ టాక్స్(జీఎస్టీ)విధానం అమలైనప్పటి నుంచే జిల్లా వ్యాప్తంగా రూ.వందల కోట్లలోనే పన్ను ఎగ్గొట్టి ఉంటారనేది ఒక అంచనా.

జిల్లా మీదుగా వక్కల రవాణా...

సిగరెట్ల తరహాలోనే పెద్ద మొత్తంలో జిల్లా మీదుగా వక్కలు సరఫరా అవుతున్నాయి. కర్నాటక నుంచి ఢిల్లీ, మహారాష్ట్రకు పెద్ద మొత్తంలో వక్కలు రవాణా చేస్తారు. ఇదంతా జీరో వ్యాపారమే. కిలో వక్కలు రూ.300ల నుంచి నూ.400ల వరకు ధర పలుకుతోంది. ఒక్కో వాహనంలో 16 టన్నుల నుంచి 18టన్నుల వరకు రవాణా అవుతాయి. ఏడాదిన్నర క్రితం మూడు నెలల వ్యవధిలో రాప్తాడు సమీపంలో ఏడు వాహనాలు, ఆత్మకూరు మండల పరిధిలో ఆరు వక్కలారీలు చిక్కాయి. వీటిపై అప్పట్లో రూ.కోట్లలో జరిమానా వేశారు. ఆ తరువాత అడపాదడపా తప్ప వక్కలారీలు పెద్దగా పట్టుబడింది లేదు. గత నెలలో గుత్తిటోల్‌గేట్ వద్ద 15రోజుల వ్యవధిలో అనంతపురం సీటీఓ-1 అధికారులు సీజ్ చేసి జరిమానా విధించారు. జిల్లాలోకి ఎక్కువగా కళ్యాణదుర్గం, ఆత్మకూరు మీదుగా అనంతపురం హైవే మీదుగా, మరో రూట్‌లో మడకశిర, పెనుకొండ మీదుగా జిల్లాను దాటి వెళ్తున్నాయి. ఈ వక్క లారీలు వేబిల్లు లేకుండానే తరచూ వెళ్తుండే ఈ వాహనాలు పట్టుబడకుండా సంబంధిత అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందజేస్తారట.

అకౌంటెంట్ ముడుపుల వ్యవహారం

వక్క లారీల విషయంలో ఓ అధికారి లంచాలు బాగా మరిగారని సమాచారం. పన్నుల శాఖ పరిధిలోని కళ్యాణదుర్గం సర్కిల్‌లో పనిచేసే ఓ అధికారికి వక్కల వ్యాపారులతో మధ్యవర్తిగా రాయబేరాలు నడుపుతుంటారని సమాచారం. కళ్యాణదుర్గం, ఆత్మకూరు మీదుగా అనంతపురం హైవే మీదుగా వక్కల లారీలు రవాణా అవుతాయి. కానీ ఆ సార్ ఆ సర్కిల్‌లోకి వెళ్లినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క లారీ పట్టిన పాపాన పోలేదు. ఇతర అధికారులు, సిబ్బందికి సైతం ఈయన నుంచే వాటాలు వెళ్తాయనే ఆరోపణలున్నాయి. ఇక అనంతపురం నగరంలో పనిచేసే ఓ ప్రైవేట్ అకౌంటెంట్ పన్నుల శాఖ అధికారులతో డబ్బు సంబంధాలు నెరుపుతున్నాడు. గతంలో లెక్కల విషయంలో అకౌంటెంట్‌గా పనిచేసిన అనుభవం ఉంది. వక్క లారీల యజమానులతో జత కలిసిన ఈ అకౌంటెంట్ అధికారులతో లావాదేవీలు మాట్లాడుతాడని సమాచారం. జిల్లాలోనే కాక కర్నూలు జిల్లా అధికారులకు సైతం ఈ అకౌంటెంట్ నుంచే ముడుపులు వెళ్తుంటాయని తెలిసింది.

జగనన్న కాలనీలకంటూ..

తాడిపత్రి నుంచి గ్రానైట్ జీరో వ్యాపారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కడా లేని విధంగా తాడిపత్రిలో గ్రానైట్ ఫ్యాక్టరీలున్నాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని గ్రానైట్ క్వారీల నుంచి గ్రానైట్ గుళ్ల వెళ్తాయి. అక్కడ గ్రానైట్ రాళ్లుగా మార్చి రవాణా చేస్తుంటారు. అక్కడి నుంచి కర్నాటక రాష్ట్రానికి బిల్లుల్లేకుండా తరలించేస్తున్నారు. ఇదంతా జీరో బిజినెస్సే. తనిఖీల్లో పన్నులశాఖ, విజిలెన్స్ అధికారులు నిలదీస్తే కొత్త కథలు చెబుతున్నారట. జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు లేఅవుట్లలో ప్లాట్లకు చుట్టూ హద్దుల కోసమని రవాణా చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు ప్రశ్నిస్తే గనుల శాఖ అధికారులు జోక్యం చేసుకుంటున్నట్లు సమాచారం. అవి వాటి కోసమే అని, వదిలేయాలని సూచిస్తున్నారట. ఇందుకు పన్నుల శాఖ అధికారులు ప్రత్యేకంగా ప్రభుత్వం విడుదల చేసి జీఓ ఉందా ఉంటే పంపాలని అడిగితే సమాధానం ఉండదట. ఇక అధికారపార్టీ వైసీపీ నేతల నుంచి అదే స్థాయిలో సిఫార్సులు, బెదిరింపులు ఉంటున్నాయట. జగనన్న కాలనీలకని వెళ్లే వాహనాలు 100 వెళ్తే అందులో 90కిపైగా జీరో బిజినెస్‌కు సంబంధించినవే ఉంటున్నాయని సమాచారం. దీంతో ఇదెక్కడి వ్యవహారమంటూ కమర్షియల్ టాక్స్ అధికారులు ఆ గ్రానైట్ వాహనాలను ఆపడమే మానేశారట.

అధికారుల కన్నుగప్పి..

పన్నుల శాఖ అధికారుల కన్నుగప్పి కొన్ని వస్తువులు అక్రమంగా రవాణా అవుతున్నాయి. వాటిలో ప్రధానంగా సిగరెట్లు, సెల్‌ఫోన్ విడిభాగాలు, రెడీమేడ్ దుస్తులు ఉంటున్నాయి. కేంద్ర జీఎస్టీ అధికారులు పట్టుకున్న సిగరెట్ల సరుకు బెంగుళూరుకు వెళ్లినప్పటికీ అక్కడి నుంచి కొంత మొత్తంలో మళ్లీ జిల్లాకు చేరుతుందని సమాచారం. బ్రాండ్లు లేని సిగరెట్లు అక్రమంగా తరచూ వస్తుంటాయని సమాచారం. ఇక సెల్‌ఫోన్ యాక్సెసరీలు జిల్లాలోని పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. ఇవి కూడా వేబిల్లులు లేకుండానే వస్తున్నాయి. ఇక రెడీమేడ్ దుస్తుల అమ్మకాలు, అదే క్రమంలో దుకాణాలు పెరిగాయి. దీంతో సంబంధిత వ్యాపారులు జీరో బిజినెస్‌కు అలవాటుపడ్డారు. ఇవన్నీ వివిధ పేర్లతో నడిపే ట్రాన్స్‌పోర్ట్ వాహనాల నుంచి రవాణా అవుతున్నట్లు సమాచారం. కొందరు అధికారులు ఆడిట్ తదితర పేర్లతో వసూలు చేస్తున్నారు. ఇలా మొత్తం మీద కొందరు అధికారులు తమ జేబులు నింపుకుంటూ జీఎస్టీ ఆదాయానికి గండికొడుతున్నారు.

నిలదీస్తారని..!

ఉల్లికల్లులో సిద్ధం కార్యక్రమం రద్దు

గ్రామ సమీపం వరకు వెళ్లి వెనుదిరిగిన నేతలు

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై ఊరి జనం ప్రశ్నిస్తారనేనా?



కొరివిపల్లిలో సిద్ధం కార్యక్రమానికి హాజరైన వైసీపీ నాయకులు

శింగనమల, ఫిబ్రవరి4: వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సిద్ధం కార్యక్రమానికి కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నేతలు గ్రామాల్లోకి వెళ్లాలంటే జంకుతున్నారు. జనం ఎక్కడ నిలదీస్తారోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఉల్లికల్లులో ఆదివారం తలపెట్టిన సిద్ధం కార్యక్రమాన్ని చివరి నిముషంలో రద్దు చేసుకున్నారు. చాగల్లు రిజర్వాయర్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇప్పించడంలో మాట తప్పడంపై ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి.. చాగల్లు రిజర్వాయర్ కింద ఉల్లికల్లు గ్రామస్థులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో అన్యాయం చేయడంతో వారు వైసీపీపై త్రీవ వ్యతిరేకంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మండలంలోని శివపురం నుంచి శింగనమలకు సిద్ధం కార్యక్రమాన్ని తలపెట్టారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ప్రభుత్వ విద్యాసహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, హాజరయ్యారు. మధ్యాహ్నం కొరివిపల్లి తరువాత ఉల్లికల్లులోకి వెళ్లాల్సి ఉంది. గ్రామస్థులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారనీ, నాయకులను అడ్డుకుంటారని వైసీపీ నాయకులకు సమాచారం అందింది. దీంతో గ్రామ సమీపం వరకు వెళ్లిన నాయకులు ఊరిలోకి వెళ్లకుండా వెనుదిరిగారు. రెండ్రోజుల క్రితం ఎమ్మెల్యే పద్మావతికి మహిళా కార్యకర్త చెన్నమ్మ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో తమ గ్రామానికి త్రీవ అన్యాయం చేశారని ఆరోపించారు. జగన్ ప్యాకేజీ ఇస్తాడంటూ ఐదేళ్లపాటు కథలు చెప్పి మోసం చేశారనీ, ఇప్పుడు వైసీపీ నాయకులు ఏ మొహం పెట్టుకుని వస్తారనీ, ఊరిలోకి ఎలా అడుగు పెడుతారో చూస్తామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలోకి వెళ్లకుండా వెనుదిరిగారు. దీంతో గ్రామస్థులు మరింత ఆగ్రహానికి లోనయ్యారు. వెనుదిరిగిన నాయకులు ఎన్నికల్లో ప్రచారానికి వస్తారు కదా.. అప్పుడు చూస్తామంటూ హెచ్చరించారు.

అతీతులా..?

ఆ అధికారులకు ఎన్నికలు నిబంధనలు వర్తించవా?

బదిలీ అవుతారా.. ఇక్కడే ఉంటారా?

అధికార వర్గాల్లో తీవ్ర చర్చ



అనంతపురం టౌన్, ఫిబ్రవరి 4: జిల్లాలో ఆ అధికారులకు ఎన్నికల నిబంధనలు వర్తించవా అనే చర్చ సాగుతోంది. నిబంధనల మేరకు జిల్లాలో మూడేళ్లకుపైగా పనిచేసి ఉండుంటే తప్పనిసరిగా బదిలీ కావాలి. లోకల్ అధికారులైతే మూడేళ్ల నిబంధన అవసరం లేదు. జిల్లా నుంచి బదిలీ చేసి పంపాలి. జనవరి 31వతేదీలోగా ఈ బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పటికే తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్డీఓలు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. కొన్నేళ్లుగా జిల్లాలో కీలక శాఖల ఉన్నతాధికారులుగా పనిచేస్తున్న కొందరు మాత్రం బదిలీ కాలేదు. మహిళాసంఘాలకు సంబంధించిన శాఖాధికారి నాలుగేళ్లకు పైగా ఇక్కడే పనిచేస్తున్నారు. అదే కాంపౌండ్‌లోనే ఉన్న మరో కీలక శాఖకు ఇన్‌చార్జి అధికారిగా కూడా వ్యవహరిస్తున్నారు. అదే ఆవరణలోని మరో కీలకమైన పేదలకు ఉపాధి కల్పించే శాఖాధికారి సైతం మూడున్నరేళ్లుగా జిల్లాలో పనిచేస్తున్నారు. ఈ మూడు శాఖలు అత్యంత కీలకం. ఎన్నికల్లో కూడా అధికార పార్టీ ఈ శాఖల ద్వారా లబ్ధిపొందిన వారి నుంచి లాభపడాలని చూస్తోంది. అధికార పార్టీ నేతలు సైతం ఈ శాఖల ఉన్నతాధికారులుగా తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం అధికార పార్టీలోని కీలక సామాజికవర్గానికి చెందినవారే ఉన్నారు. అందుకే ఎన్నికల నిబంధనలు వారికి వర్తించకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నట్లు చర్చ సాగుతోంది. ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఇందులో ఓ అధికారి అనంత నగరానికి సమీపంలో ఉన్న ఓ సమస్యాత్మక నియోజకవర్గానికి ఈఆర్‌ఓగా పనిచేస్తూ వచ్చారు. ఇంకో అధికారి గుంతకల్లు ఈఆర్‌ఓగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఇద్దరు అధికారులు.. వైసీపీ నేతలు చెప్పిన దానికి తలూపేస్తారన్న వాదన బహిరంగంగానే వినిపిస్తోంది. ఓ అధికారి ఇంకో అడుగు ముందుకేసి.. పాలక పార్టీ నేతలకన్నా అధికంగా రుబాబు చేస్తూ ఉద్యోగులు, సిబ్బందిని బెదరిస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక అధికారిది సీఎం సొంత జిల్లాకాగా, మరొకరిది ఇన్‌చార్జి మంత్రి జిల్లా. అందుకే వారికి అధికార పార్టీ అంటే అంత ప్రేమనీ, ఎలాగైనా ఆ పార్టీకి ఓట్లు పడేలా వీరు పనిచేస్తారన్న ప్రచారం ఉంది.

జిల్లా ఉన్నతాధికారి సైతం రెవెన్యూ అధికారులతో చేయించాల్సిన పని ఇందులోని ఓ శాఖ అధికారితో చేయిస్తారన్న విమర్శలు లేకపోలేదు. అందుకే వీరిని ఇక్కడే ఉంచుకోవాలని ఎత్తుగడ వేసినట్లు తెలిసింది. అందుకే రెవెన్యూ వారికే ఈఆర్‌ఓ బాధ్యతలు అప్పగించాలని ఈ ఇద్దరు అధికారులను తప్పించినట్లు ప్రచారం సాగుతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఓ మహిళా అధికారి అయితే పదేళ్లకుపైగా ఇక్కడే పనిచేస్తున్నారని చెబుతున్నారు. ఈ అధికారులకు ఎన్నికల నిబంధనలు వర్తింపజేసి, బదిలీ చేస్తారా.. ఏదో ఒకసాకు చూపి ఇక్కడే ఉంచుతారా అన్నదానిపై అధికార, ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది.


తుది జాబితాలోనూ తప్పులే..!

డబుల్ ఓట్లు యథాతథం..

మర్రిమాకులపల్లిలో 1360 ఓట్ల తొలగింపు...

ముంపునకు గురైందని బూత్‌నుసైతం తీసేసిన అధికారులు

తప్పు జరిగిందంటూ పేర్ల నమోదుకు అవకాశం



రెండు చోట్ల నమోదైన ఓటు

తాడిమర్రి, ఫిబ్రవరి 4: ఓటరు జాబితాలో తిరిగి అవే తప్పులు దొర్లాయి. మరణించిన వారి వివరాలు ప్రతి గ్రామంలో ఉన్నా వాటిని సవరించలేదు. పిన్నదరి గ్రామానికి చెందిన సాకే విజయ్‌కుమార్ రెండవ పోలింగ్ బూత్‌లో 789 సీరియల్ నెంబరులో ఉండగా మూడవ పోలింగ్ బూత్‌లో 755 సీరియల్ నెంబరుతో నమోదు చేశారు. రెండు చోట్ల ఒకే అడ్రసు ఉండగా కార్డు నెంబరు మాత్రం మారింది. సుధాకర్ పేరు కూడా సీరియల్ నెంబర్ 382లో ఒకసారి, 766లో మరొకసారి నమోదు చేశారు. సాకే చిన్నగంగన్న 512, 655 సీరియల్ నెంబర్‌లో కూడా చేశారు. ఇలా ప్రతి గ్రామంలో డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. ఆత్మకూరు గ్రామానికి చెందిన పోలింగ్‌బూత్‌లో ఉన్న పేర్లు తాడిమర్రి పోలింగ్ బూత్‌లలో కూడా ఉండటం విశేషం. వీటికితోడు మండలంలోని మర్రిమాకుల పల్లి గ్రామంలో దాదాపు 1360 మంది ఓటర్లు ఉండగా గ్రామం ముంపునకు గురైందని చెప్పి పోలింగ్ బూత్‌ను తీసివేయడంతోపాటు ఓటరు జాబితా నుంచి ఆ గ్రామానికి చెందిన వారి పేర్లన్నీ పూర్తిగా తొలగించారు. తాజాగా పేర్లు నమోదు చేయించుకునేందుకు వారికి ఇప్పుడు అవకాశం కల్పించి నమోదు చేయించే ప్రయత్నం చేస్తున్నారు.



డోర్ నంబరు చోట పరిశ్రమగా నమోదు చేసిన అధికారులు

ఇంటి నంబరుగా పరిశ్రమ


శింగనమల: మండలంలోని లోలూరు గ్రామ ఓటరు జాబితాలో ఇంటి నంబరును పరిశ్రమగా నమోదు చేశారు. ఇంటి నంబరు వద్ద పరిశ్రమ నో 1 అంటూ 50 మందిని ఓటర్లుగా నమోదు చేశారు. పోలింగ్ బూత్ 79లో ఇంటి నెంబర్లను తప్పుగా వేశారు. ఇదే బూత్‌లో టై1, టై2 అని ఇంగ్లీష్ అక్షరాలతో నమోదు చేసి ఓటరుకు ఇంటి నంబరుగా కేటాయించారు.



లక్ష్మీదేవి బతికున్నా చనిపోయినట్లు చూపించి డిలీట్ చేసిన దృశ్యం

బతికున్నా చంపేశారు...

పెనుకొండ రూరల్: బతికున్నవారు చనిపోయినట్లు, చనిపోయినవారు బతికున్నట్లు ఓటరు జాబితాలో నమోదైంది. ఓటరు జాబితాలో తప్పులు దొర్లాయని రాజకీయ పార్టీల నాయకులు బీఎల్‌ఎలకు, ఎన్నికల నిర్వహణాధికారులకు ఫిర్యాదు చేసినా సవరించిన జాబితాలో అవే తప్పులు చోటుచేసుకున్నాయి. మండలంలోని శెట్టిపల్లిలో 93, 94 పోలింగ్ బూత్‌లలో వరుస సంఖ్య 295 జీ కాంతమ్మ మూడేళ్ల క్రితం చనిపోయింది. ఆమెను తొలగించే క్రమంలో వరుస సంఖ్య 299 లక్ష్మీదేవి చనిపోయినట్లు ఓటరులిస్ట్‌లో నమోదైంది. అదేవిధంగా వరుస సంఖ్య 323 ఫక్రుద్దీన్ చనిపోయారు. ఓటరు జాబితా లిస్ట్‌లో తొలగించలేదు.



చనిపోయినా ఓటరు జాబితాలో బతికున్నట్లు ఉన్న దృశ్యం

కారు, ద్విచక్రవాహనం ఢీ

ఇద్దరు మృతి... ఇరువురికి గాయాలు



రాజు మృతదేహం

ఉరవకొండ, ఫిబ్రవరి 4: మండలంలోని బూదగవి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు(47), రాజు(27) మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. విడపనకల్లుకు చెందిన రామాంజినేయులు, రాజు బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం పని నిమిత్తం రామాంజనేయులు, రాజుతో కలిసి ఉరవకొండకు వచ్చారు. పని ముగించుకుని ద్విచక్రవాహనంలో విడపనకల్లుకు వెళ్తుండగా, బళ్లారి నుంచి అనంతపురం వైపునకు వెళ్తున్న కారు, స్కూటర్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలో ఉన్న రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు పల్టీలు కొట్టి పొలంలో పడింది. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జైంది. రాజుకు గాయాలు కావడంతో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజు మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న బళ్లారికి చెందిన అభిషేక్, శుక్లా గాయపడ్డారు. మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



దెబ్బతిన్న ద్విచక్రవాహనం



రోదిస్తున్న రామాంజనేయులు కుటుంబసభ్యులు



చెన్నేకొత్తపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పరిటాల సునీత



సిండికేట్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

జయహో బీసీ సదస్సులో మాజీ మంత్రి పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి/అనంతపురం రూరల్, ఫిబ్రవరి 4: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. నగరంలోని సిండికేట్‌నగర్, చెన్నేకొత్తపల్లిలో ఆదివారం నిర్వహించిన జయహో బీసీ సదస్సుల్లో మాజీమంత్రి పాల్గొన్నారు. ఆయా సమావేశాల్లో పరిటాల సునీత మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమపథకాలు అమలు చేశారన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తిప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు బీసీలు, ఎస్టీలకు చెందిన భూములను లాక్కోవడం, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం జరుగుతోందన్నారు. స్థానికంగా ఓ వైసీపీ నాయకుడి డాబాను కేంద్రంగా చేసుకుని మట్టి, ఇసుక, భూ కబ్జాలకు తోపుదుర్తి సోదరులు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీసీలంతా ఐకమత్యంగా టీడీపీ విజయానికి కృషిచేయాలని సూచించారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలో తాను, పరిటాల శ్రీరామ్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. సదస్సులో నియోజకవర్గ పరిశీలకుడు బత్తిని వెంకటరాముడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, రామసుబ్బమ్మ, ఎజ్జే శంకర్, అంకే అమరేంద్ర, ముత్యాలప్ప, జనసేన క్రాంతి కుమార్, వరలక్ష్మి, బెస్త నాగార్జున, బండారు భార్గవ, భాస్కర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

మండలంలోని హరియన్‌చెరువు, ఎర్రోనిపల్లికి చెందిన పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. జయహో బీసీ సదస్సులో మాజీమంత్రి పరిటాలసునీత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. హరియన్‌చెరువుకు చెందిన కాటమయ్య, సుబ్బరాయుడు, రమేశ్, నాగేంద్ర, రంగనాయకులు, పోతన్న, ఎర్రోనిపల్లికి చెందిన గంగప్ప, ఎర్రప్ప, ఎగువతండాకు చెందిన సుధాకర్‌నాయక్ తదితరులకు పరిటాలసునీత పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

మెగా డీఎస్సీ అడిగితే... అక్రమ కేసులు పెడతారా..?

తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకుల మండిపాటు



ప్లకార్డులు చూపుతూ మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 4: నిరుద్యోగులు మెగా డీఎస్సీ ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ నిరసన తెలిపితే వారిపై అక్రమంగా కేసులు పెట్టడం దుర్మార్గమని వెంటనే ఆ కేసులు ఎత్తివేయాలని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మినరసింహ, జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నిరుద్యోగులు వైసీపీ ప్రభుత్వం కేబినెట్‌లో 6100 డీఎస్సీ పోస్టులకు ఆమోదం తెలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. నగరంలో నిరుద్యోగులంతా శాంతియుతంగా ర్యాలీ చేస్తూ కలెక్టరేట్‌కు వెళ్లి నిరసన తెలిపారన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలిపిన నిరుద్యోగులు, నాయకులపై అక్రమంగా ఈ ప్రభుత్వం పోలీసులతో కేసులు పెట్టించడం దారుణం అన్నారు. జగన్ ప్రభుత్వం ఆఖరికి నిరుద్యోగులపై కూడా అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. ఇది నిరుద్యోగుల పాలిట దగా డీఎస్సీనేనని, మరొకటి కాదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సుమారు 40 వేల మందికిపైగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. మరీ తక్కువగా 4 ఎస్‌జీటీ పోస్టులు ఇవ్వాలని చూస్తుండటం అన్యాయం అన్నారు. వెంటనే 28 వేల డీఎస్సీ పోస్టులు భర్తీ చేయాలని, లేకుంటే జగన్ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నరేష్, వీరనంద, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. ఇబ్బందిపడ్డ లబ్ధిదారులు



పురంలో సర్వర్ సమస్యతో కుస్తీ పడుతున్న సిబ్బంది



హిందూపురంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులు

సర్వర్ సమస్యతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. జగనన్న ఇంటి పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. దీంతో ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులుకాచారు. అయితే సర్వస్ సమస్య తలెత్తడంతో సాయంత్రం వరకు లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ముందుకుసాగని జగనన్న ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 4: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇల్లు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. సచివాలయ సెక్రటరీలతో రిజిస్ట్రేషన్ చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం సైతం పనిచేయాల్సిందిగా వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆదివారం వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. లేపాక్షి మండలానికి సంబంధించి లేపాక్షిలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే సర్వర్, నెట్‌వర్క్ సమస్య తలెత్తడంతో చేసేదిలేక హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాల్సివచ్చింది. లేపాక్షి నుంచి పెద్దసంఖ్యలో లబ్ధిదారులు తరలివచ్చారు. దీంతో సచివాలయ సెక్రటరీలే కాకుండా హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కూడా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం కూడా తమకు ఏంటి ఈ పరిస్థితి అని వారు అనుకోవడం కనిపించింది. హిందూపురం మండల పరిధిలో 5500 ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ కావాల్సివుంది. అయితే సెక్రటరీలకు అవగాహన లేకపోవడం, సర్వర్ సమస్యతో ఆదివారం కేవలం 70 వరకు రిజిస్ట్రేషన్ జరిగినట్లు సమాచారం.

శింగనమల: పేదల ఇల్లపట్టాలకు సంబంధించి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. శింగనమల నియోజకవర్గానికి సంబంధించి ఆదివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను 90 శాతం మేర పూర్తిచేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీలో ఇల్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు భారీసంఖ్యలో లబ్ధిదారులు తరలివచ్చారు. శింగనమల, నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం నుంచి లబ్ధిదారులు శింగనమల రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించగానే సర్వర్ సమస్య తలెత్తింది. మధ్యాహ్నం 3 గంటలకు సర్వర్ పనిచేయడంతో 10మంది లబ్ధిదారులకు సంబంధించి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో మిగతా లబ్ధిదారులు ఈ మాత్రానికి ఇంత ఆర్భాటమెందుకని అక్కడి నుంచి వెళ్లిపోవడం కనిపించింది.

జిల్లా కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 4: జిల్లా మండల విద్యాశాఖాధికారులు-2 సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవిచంద్ర ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా భవానీ శంకర్, ప్రధానకార్యదర్శిగా నారపరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా లింగా నాయక్, కోశాధికారిగా తిప్పేస్వామి, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకట రమేష్, అదనపు ప్రధానకార్యదర్శిగా సరితారాణి, కార్యవర్గ సభ్యులుగా ధనలక్ష్మి, తిమ్మప్ప, బాబు, శివప్రసాద్, మల్లికార్జున, సనావర్ బాషా, రాష్ట్ర ప్రతినిధులుగా రామచంద్ర, మదన్ మోహన్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2లు గురుప్రసాద్, హరికృష్ణ, ఓబుళపతి, మల్లికార్జున, మనోహర్, సుబ్బరాయుడు, కుళ్లాయప్ప, రామగోవిందరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరాటాల యోధుడు వడ్డె ఓబన్న



వడ్డె ఓబన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 4: పోరాటాల యోధుడు వడ్డె ఓబన్న అని వడ్డెర్ల సంఘం నాయకులు కొనియాడారు. ఆదివారం పట్టణంలోని శ్రీకంఠపురం సర్కిల్‌లో వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ వారు భారతీయులను బానిసలుగా చూస్తున్న సమయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి పోరాటాలు చేసిన యోధుడు ఓబన్న అని అన్నారు. రేనాటి ప్రాంత ప్రజల గుండెల్లో నిలిచిపోయిన గొప్ప నాయకుడన్నారు. ఐక్యతతో వడ్డెర్లు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలన్నారు. అంతకుముందు యువత బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వడ్డె ఓబన్న 6వ తరం మనవడు బాలనరసింహులు, కర్ణాటక మాజీ మంత్రి వెంకటరమణప్ప, కర్ణాటక బెంగళూరు ఓబీసీ సంఘవ హనుమంతరాయప్ప, డీఎస్పీ వేణుగోపాల్, ఆ సంఘం నాయకులు రంగప్ప, ప్రసాద్, నాగరాజు, వెంకటేష్, కొల్లకుంట అంజినప్ప, దేవర్ల మురళి, మల్లెల జయరాం, ఓబీసీ అధ్యక్షుడు వెంకటేశులు, దుర్గా నవీన్, 9వ వార్డు కౌన్సిలర్ మంజుల హాజరయ్యారు.

7న కలెక్టరేట్ వద్ద ధర్నా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4: పంటనష్ట పరిహారం కోరుతూ ఈనెల 7న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వర్షాభావంతో జిల్లాలో ఐదులక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. జరిగిన నష్టంలో పావు వంతు కూడా పరిహారం ప్రకటించలేదన్నారు. జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 251 కోట్లు పరిహారం ప్రకటించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదని విమర్శించారు. సంక్రాంతి పండుగ నాటికి రైతుల ఖాతాలకు జమ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా అమలు చేయలేదన్నారు. బటన్ నొక్కి లెక్కలు చెబుతున్న ముఖ్యమంత్రికి ప్రకటించిన పంట నష్టపరిహారం నిధులు విడుదల చేసే విషయం గుర్తులేదా..? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రకటన వస్తే ప్రకటించిన పరిహారం కూడా అందదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పంటనష్ట పరిహారం వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో రైతులు, కూలీలు, కౌలురైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనంతకు నాలుగు డీఎస్సీ పోస్టులా..!

మెగా డీఎస్సీ కోసం జిల్లాలో వేలాదిమంది నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే కేవలం నాలుగు పోస్టులు మాత్రమే కేటాయించడం తగదని రాంభూపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. 23వేలకుపైగా డీఎస్సీ పోస్టులు ప్రకటించాల్సి ఉండగా... నాలుగేళ్ల నిరీక్షణ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 6వేల పోస్టులు మాత్రమే ప్రకటించడం, అందులోనూ నాలుగు వేల పోస్టులకే క్లియరెన్స్ ఇవ్వడం దారుణమన్నారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించిన డీవైఎఫ్ఐ ఆందోళనలో నిరుద్యోగులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మీడియాపై దౌర్జన్యం సరికాదు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 4: మంత్రి ఉషశ్రీ చరణ్.. మీడియాపై దౌర్జన్యం చేయడం సరికాదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆదివారం అన్నారు. శనివారం సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామంలో అధికార పార్టీ నాయకుల నుంచి మంత్రికి నిరసన సెగ తగిలింది. ఈ క్రమంలో వీడియో తీస్తున్న మీడియా ప్రతినిధిపై గన్‌మన్‌ను ఉసిగొలపడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు ఇలాంటి దాడులు మానుకోవాలని, ఎస్పీ స్పందించి గన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

'మంత్రిని బర్తరఫ్ చేయాలి'

పెనుకొండ టౌన్: మీడియా ప్రతినిధులపై గన్‌మెన్‌ను ఉసిగొలిపిన మంత్రి ఉషశ్రీచరణ్‌ను బర్తరఫ్ చేయాలని జైభీమ్‌భారత్‌పార్టీ జిల్లా కోకన్వీనర్ ఊటకూరు నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మాట్లాడుతూ.. ఆత్మీయ పలకరింపు సందర్భంగా తలెత్తిన పరిణామాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులు సెల్‌ఫోన్ లాక్కుని, గన్‌మెన్ వీడియోలు డిలీట్ చేయించడం తగదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణహత్య

ధర్మవరం, ఫిబ్రవరి 4: పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో వ్యక్తి దారుణహత్యకు గురైనట్లు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ ఆదివారం వెల్లడించారు. ఇందిరమ్మకాలనీకి చెందిన బొగ్గుప్రతాప్(35) కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. బొగ్గు ప్రతాప్, కేతిరెడ్డికాలనీకి చెందిన స్నేహలత ఇంటర్ చదివే సమయంలో ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి కుటుంబసభ్యులు ఒప్పుకోలేదు. దీంతో బొగ్గుప్రతాప్, స్నేహలత వారివారి తల్లిదండ్రులు నిశ్చయించిన వివాహాలు చేసుకున్నారు. కొంత కాలం క్రితం బొగ్గు ప్రతాప్ భార్య మృతిచెందింది. దీంతో అతడు మళ్లీ కేతిరెడ్డికాలనీలో ఉన్న స్నేహలత ఇంటికి వెళ్లేవాడు. గమనించిన స్నేహలత కుటుంబసభ్యులు ఆమెను మందలించారు. ఈ క్రమంలో ఆదివారం ప్రతాప్ అతిగా మద్యం సేవించి, స్నేహలత ఇంటికి భర్తలేని సమయంలో వెళ్లి ఆమెను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. ఆమె ఇంటిలో ఉన్న రోకలిబండతో తలపై బాది, అక్కడి నుంచి పరారైంది. రక్తస్రావంతో ప్రతాప్ కింద పడిపోగా.. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్నేహలతను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సైనికుల్లా.. అప్రమత్తంగా ఉండాలి

రామగిరి, ఫిబ్రవరి 4: ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా అప్రమత్తంగా ఉండాలని ఆ పార్టీ నాయకులు సూచించారు. ఆదివారం మండలంలోని పేరూరు గ్రామంలో సాధికార సారధులు, మండల నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ వరకు బాధ్యతా యుతంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితా తప్పులు, డబుల్ ఎంట్రీలు, మృతిచెందిన వారి పేర్లు ఓట్లు అన్నింటిని క్షున్నంగా పరిశీలించి సంబంధించిన అధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్ సమయంలో కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు రామ్మూర్తి నాయుడు, పరందామ యాదవ్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, నాయకులు శివకు మార్, శ్రీధర్ నాయుడు, కురుబ వెంకటేశ్; సురేశ్, సుబ్బు, నాగరాజు, చిత్తరం జన్, సుబ్బరాయుడు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటేశ్, పోతన్న, ఎంపీ టీసీ శ్రీనివాసులు, రామాంజినేయులు, మాదాపురం శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీఎస్సీ.. ఎన్నికల జిమ్మిక్కే

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు



నార్పల, ఫిబ్రవరి 4: ఎన్నికల్లో లబ్ధి కోసం జగన్‌రెడ్డి ఈ డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని, ఇది పూర్తిగా ఎన్నికల జిమ్మిక్కేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు ధ్వజమెత్తారు. ఆదివారం మండలంలోని బొందలవాడ స్వగృహంలో ఆయన మాట్లాడుతూ.. మొత్తం 50,892 ఖాళీలుంటే 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చి మరోసారి నిరుద్యోగులను, యువతను మోసం చేయడానికి జగన్‌రెడ్డి యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇంతకాలం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధంగా ఉందన్నారు. ఈ సైకో రెడ్డి తన పాలనతో రాష్ట్రాన్ని నిరుద్యోగాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,745 మంది యువతీయువకులు ఉపాధిలేక ఆత్మహత్యలు చేసుకున్నారని, వాళ్ల ఉసురు ఊరికే పోదని అన్నారు.

నేడు డీఆర్‌ఓ రాక

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 4: నూతన డీఆర్‌ఓగా రామక్రిష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఇక్కడి డీఆర్‌ఓ గాయిత్రీదేవి ఎన్నికల్లో భాగంగా డైరెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆమె ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో కడప జిల్లాలో పనిచేస్తున్న రామక్రిష్ణారెడ్డిని నియమించారు.

శింగనమలలో 7 నుంచి ఉరుసు

శింగనమల, ఫిబ్రవరి 4: స్థానిక హజ్రత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజి దర్గా ఉరుసును ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా ముత్తవల్లి ముల్లా అబ్దుల్ రవూఫ్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున గ్రామ వీధుల్లో గంధం ఊరేగింపు, గురువారం ఇరుసు పందెం, రాత్రికి ఖవాలీ, శుక్రవారం రాత్రి తెలుగు, హిందీ పాటలతో ఆర్కెస్ట్రాతో ఉరుసు ముగుస్తుందన్నారు.

డ్రోన్ ఆపరేటింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4: అత్యాధునిక సాంకేతిక రంగంలో ప్రాధాన్యత కలిగిన డ్రోన్ ఆపరేటర్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ తెలిపారు. మూడు నెలల ఈ కోర్సులో నైపుణ్యశిక్షణ, మధ్యాహ్నం భోజన సదుపాయం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 19-35 వయస్సు కలిగి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. బుధవారం నుంచి ప్రారంభించే ఈ శిక్షణకు సంబంధించి మరిన్ని వివరాలకు 99401 98805, 97909 57378ను సంప్రదించాలని కోరారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం: జనసేన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 4: జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని, రాష్ట్రం అభివృద్ధిలో 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని జనసేన పార్టీ రాయలసీమ రీజిన్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 8వ డివిజన్ రాణీనగర్‌లో పర్యటించారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే జనసేన, టీడీపీ ప్రభుత్వ స్థాపనతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఐకమత్యంగా పోరాడాలి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 4: వాల్మీకులు హక్కుల సాధన కోసం ఐకమత్యంగా పోరాడాలని వాల్మీకి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రుద్రం పేటలోని వాల్మీకి భవన్‌లో వాల్మీకి అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం నాయకులు హరి, సూర్యనారాయణ మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా వాల్మీకులంతా ఏకతాటిపై నిలబడి ముందుకు సాగితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటరాముడు, బాల వెంకటేశ్వర్లు, జయరాజ్, కొత్తపల్లి సురేష్, నరేంద్ర, నరసింహ, తిప్పయ్య, కేశవ, సాంబ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఏపీఎల్


మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ యోగానంద

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4: స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ ఆదివారం నిర్వహించిన సీనియర్ అనంత ప్రీమియర్ లీగ్ క్రికెట్ టీ-20 పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో గుంతకల్లుపై అనంతపురం, విక్కీ లెవెన్ జట్టుపై మడకశిర క్రికెట్ క్లబ్ జట్లు విజయం సాధించాయి. 60 పరుగులు చేసిన యోగానందకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.



మౌనగిరి క్షేత్రాన్ని దర్శించుకున్న జర్మనీ దేశస్థులు

రాప్తాడు, ఫిబ్రవరి 4: మండలంలోని హంపాపురం సమీపంలోని మౌనగిరి హనుమాన్ క్షేత్రాన్ని జర్మనీ దేశస్థులు ఆదివారం దర్శించుకున్నారు. హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ సందర్శన అనంతరం జర్మనీ దేశస్థులు క్రిష్టోఫ్, జాస్కాలు 39 అడుగుల ఏక శిలా ఆంజనేయస్వామి విగ్రహాన్ని దర్శించుకుని పూజలు చేశారు. వారివెంట సంగీత అగర్వాల్, రాజీవ్, వాటర్ షెడ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ, ఫిబ్రవరి 4: మండలంలోని ఓ గ్రా మంలో ఇద్దరు ఆదివారం వ్యవసాయ పొలంలో పురు గుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించారు. గతంలో వీరిద్దరూ ప్రేమించుకున్నారు. మూడేళ్ల క్రితం వీరి ప్రేమ వ్యవహారంపై పెద్దలు పంచాయితీ చేశారు. ఇద్దరికీ వేర్వేరుగా పెళ్లిళ్ల అయ్యాయి. మూడు రోజుల క్రితం మహిళ ఆ గ్రామానికి వచ్చింది. ప్రేమ వల్ల ఇబ్బంది లు, గొడవలు వస్తున్నాయని పాత ప్రేమికుడితో చెప్పు కుని బాధపడింది. దీంతో మనస్తాపం చెందిన ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అపస్మారక స్థితిలో పడిఉన్న వారిని స్థానికులు ఉరవ కొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపైన ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

పామిడి, ఫిబ్రవరి 4: పట్టణంలోని సీతాపురం రైల్వే బ్రిడ్జి వద్ద రైలు ఢీకొని వడ్డే ఎర్రిస్వామి(48) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అనంతపురం ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపిన మేరకు .. పట్టణంలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన వడ్డే లింగప్ప కుమారుడు వడ్డే ఎర్రిస్వామికి చిన్నప్పటి నుంచి మతిస్థిమితం లేదన్నారు. రోజూ ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ ఉంటాడన్నారు. మతిస్థిమితం లేక రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా మూడు రోజుల క్రితం రైలు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి బ్రిడ్జి కింద పడి మరణించాడని తెలిపారు.

పేపర్లలోనే పీహెచ్‌సీ..!


యర్రగుంట్ల పీహెచ్‌సీకి కేటాయించిన స్థలంలో పెరిగిన కంప చెట్లు

- 'యర్రగుంట్ల'కు అందని ప్రాథమిక వైద్యసేవలు
- మూడేళ్లయినా ప్రారంభంకాని పనులు
- స్థల సేకరణతోనే సరిపెట్టిన పాలకులు
- పీహెచ్‌సీ నిర్మాణం కాకనే ఇద్దరు వైద్యుల కేటాయింపు
- భవనం లేకపోవడంతో గార్లదిన్నె పీహెచ్‌సీలో మకాం

ఇక్కడ ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది... ఇది నిజమండి.. అయితే అది పాలకులు, అధికారులకు మాత్రమే కనిపిస్తుంది. ఆ పీహెచ్‌సీ కేవలం పేపర్లు.. రికార్డుల్లో మాత్రమే ఉంది. మూడేళ్ల క్రితం ఈ పీహెచ్‌సీని వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. దాదాపు సంవత్సరం క్రితం జిల్లా అధికారులు లేని ఈ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను కూడా నియమించారు. భవనమే లేకపోవడంతో వారు సమీపంలోని మరో పీహెచ్‌సీలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సుమారు 20 గ్రామా ల ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సేవలు ఎడారిలో ఒయాసిస్‌లా మారాయి. ఇది గార్లదిన్నె మండలం యర్రగుంట్ల పీహెచ్‌సీ గోడు ...

గార్లదిన్నె, ఫిబ్రవరి 4 : గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసినట్లు మూడేళ్ల క్రితం పాలకులు ఆర్భాటంగా ప్రకటించారు. జగనన్న కాలనీ పక్కనే స్థలాన్ని కూడా సేకరించారు. అదిగో.. ఇదిగో అంటూ నేతల మాటలు కోటలు దాటాయి. అయితే ఇంతవరకూ ఆ పనులు ఒక్క ఇంచ్ కూడా కదల్లేదు. ఇప్పటిదాకా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభమే కాలేదు.

సిబ్బంది కేటాయింపు...

యర్రగుంట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులే ప్రారంభం కాలేదు.. అయినా వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆ పీహెచ్‌సీకి ఏడాది క్రితమే ఇద్దరు వైద్యులను నియమించడం గమనార్హం. కనీసం ఓ అద్దె భవనంలోనైనా పీహెచ్‌సీని ఏర్పాటు చేసి దాని ద్వారానైనా గ్రామీణులకు వైద్య సేవలు అందించేలా పాలకులు, వైద్యాధికారులు చర్యలు తీసుకోకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. నియమించిన వైద్యులు యర్రగుంట్లలో ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం నుంచైనా సేవలు అందించేలా చూడలేదు. దీంతో ఆ ఇద్దరు వైద్యులు గార్లదిన్నె పీహెచ్‌సీలోనే మకాం వేశారు. దీంతో యర్రగుంట్లతో పాటు సమీపంలోని దాదాపు 20 గ్రామాల ప్రజలకు ప్రాథమిక వైద్యం అందని ద్రాక్షలానే ఉండిపోయింది. ఈ గ్రామాల్లోని గర్భవతులు, బాలిం తలు, వృద్ధులు, రోగులు అత్యవసర చికిత్స కోసం గార్ల దిన్నె, అనంతపురానికి పరుగులు పెడుతూనే ఉన్నారు. తమ పీహెచ్‌సీకి కేటాయించిన వైద్యులు స్థానికంగా ఉండేలా పాలకులు, వైద్యాధికారులు చర్యలు తీసుకో వాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరగా పీహెచ్‌సీ నిర్మించాలి



త్వరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మేలు. ప్రజలు ఏదైనా అనారోగ్యానికి గురైతే మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది. కొత్త భవనం ఏర్పాటు ఆలస్యమైతే అద్దెభవనంలో అయినా పీహెచ్‌సీని నిర్వహించాలి.

- జగదీశ్వర్‌రెడ్డి, యర్రగుంట్ల, గార్లదిన్నె మండలం


యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య పరీక్షలు చేస్తున్న సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ

వైద్యులు అందుబాటులో ఉండాలి



యర్రగుంట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. యర్రగుంట్లలో ఉపకేంద్రం మాత్రమే ఉంది. రాత్రి సమయంలో ఏదైన జబ్బు చేస్తే అనంతపురానికి వెళ్లాల్సిందే. అద్దె భవనంలోనైనా పీహెచ్‌సీని నిర్వహించి వైద్యులు అందుబాటులో ఉండేలా చేయాలి.

-నరసింహారెడ్డి, ముకుందాపురం, గార్లదిన్నె మండలం

త్వరలోనే పనులు చేపడుతాం

యర్రగుంట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పనులు ఆలస్యమైన మాట వాస్తవమే. భవన నిర్మాణానికి గతంలో టెండర్లు పిలిచారు. అయితే టెండర్లకు హాజరైన వారు అర్హత లేకపోవడంతో డిస్క్వాలీఫైడ్ చేశారు. త్వరలోనే మళ్లీ టెండర్లు నిర్వహిస్తాం.

- ప్రసాద్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ, అనంతపురం

వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు

యర్రగుంట్ల ప్రాథమిక కేంద్రానికి కేటాయించిన వైద్యులు కూడా గార్లదిన్నెలో విధులు నిర్వహిస్తున్నారు. యర్రగుంట్లకు వెళ్లమని ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులూ రాలేదు. యర్రగుంట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో అక్కడి వైద్యులు ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

- గౌతమి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, గార్లదిన్నె

జగన్‌రెడ్డి... బీసీల ద్రోహి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో బీసీలకు అన్యాయం చేస్తూ.. వారిపై దాడులకు పాల్పడుతూ.. అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతూ సీఎం జగన్‌రెడ్డి చరిత్రలో బీసీల ద్రోహిగా మిగిలిపోయారని టీడీపీ నియోజకవర్గం పరిశీలకుడు గుర్రప్ప నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక బీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయనతో పాటు ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి గంజేనాగరాజు, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు ఆవుల కిష్టయ్య మాట్లాడారు. రాష్ట్రంలో ఎనిమిది వేల ఎకరాల బీసీల భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారని, వారిపై దాడులు చేయడమే కాకుండా.. వారిపైనే కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల సంక్షేమం ఒక్క టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ అశోక్ మాజీ ఎంపీపీ ఎస్‌కే వెంకటేశులు, సాధి కార కమిటీ అధ్యక్షుడు ఆదిశేషు, టీడీపీ నేతలు కేశన్న, లక్ష్మీనారాయ ణ, ఎస్‌నారాయణస్వామి, మల్లేష్, మల్లికార్జునరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, నరేంద్రయాదవ్, కొయ్యగుర పెద్దప్ప, అక్కులప్ప, లక్ష్మీనర సింహా, బండిపరుశురాం, బెస్తనారాయణస్వామి, సోముశేఖర్ పాల్గొన్నారు.


సభలో ఐక్యత చాటుతున్న టీడీపీ నేతలు

అంగన్‌వాడీలకు అభినందన సభ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని 42 రోజుల పాటు సమ్మె చేసిన అంగన్వాడీలకు ఆదివారం స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. మొదట సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీలు సమ్మెతో తమ సత్తా చాటారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి ఇచ్చిన హామీలకు సంబంధించి తక్షణమే జీఓలు జారీ చేసి త్వరితగతిన ఆ ఫలాలు అంగన్‌వాడీలకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మాజీ నాయకురాలు లలితమ్మ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, సీఐటీయూ జిల్లా కోశాధికారి గోపాల్, ఆఫీస్ బేరర్స్ మన్నీల రామాంజనేయులు, నాగభూషణం, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, జిల్లా నాయకులు పాల్గొన్నారు.


అభినందన సభలో మాట్లాడుతున్న ఓబులు

పేదల సొమ్ము కాజేసిన వైసీపీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 4: పేదలకు మంజూరు చేసిన నిధులనూ సీఎం జగన్‌రెడ్డి కాజేసి.. వేధింపులకు పాల్పడుతున్నారని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప మండిపడ్డారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పక్కాగృహాల నిర్మాణాలను రాజకీయం చేస్తారా అని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అక్కులప్ప మాట్లాడుతూ.. 2017-18లో జిల్లాలోని వేలాదిమంది దళితులకు ఎన్‌టీఆర్ పక్కాగృహాల నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.50 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేసిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ నిధులను లబ్ధిదారులకు చెల్లించకుండా ఐదు సంవత్సరాలుగా వేధిస్తున్నారని మండిపడ్డారు. దీంతో పేదలు అరకొర నిర్మాణాల మధ్య నివాసముంటూ కాలం వెల్లదీస్తున్నారని వాపోయారు. కలెక్టర్, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కూడా వైసీపీ నాయకుల్లా వ్యవహరిస్తూ పేదలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బాధితులకు బిల్లులు చెల్లించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

పశువుల సంత ఆదాయం రూ.4.22 లక్షలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 4: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.4,22,610 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,37,410, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,85,200 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ముగిసిన నేషనల్ ఫ్రిస్బీ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో అల్టిమేట్ ఫ్రిస్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నేషనల్ ఫ్రిస్బీ క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఎయిర్ బెండర్స్ బెంగళూరు, బెంగళూరు ఎయిర్‌బోర్న్ జట్లు తలపడగా.. ఎయిర్ బెండర్స్ బెంగళూరు జట్టు విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా 16 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా.. 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భారత్ మాజీ కోచ్ నందన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కోన కణ్వాశ్రమంలో అవినీతి ఉత్తమాటే..!

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 4: కోన కణ్వాశ్రమంలో అవినీతి జరగలేదని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు దత్తానందగిరిస్వామి స్పష్టం చేసినట్లు ఆ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కణ్వాశ్రమలో ఆర్థిక వనరులను దోచుకుంటున్నారని దత్తానందగిరిస్వామి గత నెల 29న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ఆలయ కమిటీ ఆదివారం సమావేశమైంది. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆరోపణలను నిరూపించాలని సమావేశంలో దత్తానందగిరిస్వామిని ప్రశ్నించామని, అందుకు ఆయన స్పందిస్తూ ఎలాంటి అవినీతి జరగలేదని, ఏదో పొరపాటున కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని అంగీకరించారని కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు చియ్యేడు ఊరు దేవర

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని చియ్యేడు ఊరు దేవర మహోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కొన్ని దశాబ్ధాల తరువాత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్నపై హర్షం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 4: స్వాతంత్ర సమరయోధుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ 100వ జయంతి సందర్భంగా ఆయనకు భారతరత్న ప్రకటించడం హర్షించదగ్గ విషయమని నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జయమణెమ్మ కళ్యాణ మండపంలో నిర్వ హించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట రంగయ్య మాట్లాడారు. కర్పూరి ఠాకూర్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీటీ తిప్పేస్వామి, నాయీ బ్రాహ్మణ మహిళా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఉమామహేశ్వరీ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు ప్రసాద్, కార్పొరేటర్ శేఖర్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షులు సుబ్రహ్మణ్యం శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, పిడుగు శ్రీనివాసులు, శ్రీధర్ శివప్రసాద్, పోతుల రాధాకృష్ణ, బండి నాగరాజు, సత్యనారా యణమ్మ, ఉషాదేవి, అన్నపూర్ణమ్మ, హనుమేష్‌బాబు, నాగరాజు పాల్గొన్నారు.


ఐక్యత చాటుతున్న నాయకులు

రైతు ఆత్మహత్య

గార్లదిన్నె, ఫిబ్రవరి 4: మండలంలోని పెనకచెర్ల డ్యాం గ్రామ రైతు బోయ సుబ్బరాయుడు (64) కుటుంబ కలహాలతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గుత్తి మండలం అనగానిదొడ్డి గ్రామానికి చెందిన బోయ సబ్బరాయుడు, లక్ష్మీదేవి కొన్ని సంవత్సరాలుగా పెనకచెర్ల డ్యాంలోనే నివాసముంటూ వ్యవసాయం చేసుకునేవారు. వీరి కుమారుడు సింగపూర్‌లో స్థిరపడ్డాడు. కుమార్తె వివాహం కావడంతో గుత్తిలో ఉంటోంది. సుబ్బరాయుడు మద్యం సేవిస్తుండడంతో భార్యభర్తలు గొడవపడేవారు. శనివారం కూడా భార్యతో గొడవ పడిన సుబ్బరాయుడు తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో హమాలీ దుర్మరణం

గార్లదిన్నె, ఫిబ్రవరి: మండలంలోని కల్లూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని హమాలీ సాంబశివుడు (37) మరణించాడు. పాతకల్లూరుకు చెందిన సాంబశివుడు రైస్‌మిల్లులో, ఇతర కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. శనివారం రాత్రి ద్విచక్ర వాహనంలో పాతకల్లూరు నుంచి పామిడి వైపు వెళ్తుండగా... గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో సాంబశివుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మరణించాడు. సాంబశివుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 4: ఐచర్ వాహనంలో 110 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా.. గార్లదిన్నె మండలం కొత్తపల్లి వద్ద విజిలెన్స్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. బియ్యాన్ని స్థానిక సీఎస్‌డీటీ హరిప్రియకు అప్పగించారు. ఈ తనిఖీల్లో సీఐ సాయిప్రసాద్, ఏఈఈ రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు కేంద్రంగా జోరుగా మట్కా

రోడ్డున పడుతున్న సామాన్య కుటుంబాలు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 4: మండలంలో మట్కా జోరుగా సాగుతోంది. సరిహద్దుతో పాటు గ్రామాలలో మట్కా ఏజెంట్లు రూ. లక్షల్లో దందా సాగిస్తున్నారు. గతంలో ఈ దందాను రహస్యంగా సాగించేవారు. ప్రస్తుతం సరిహద్దుల్లో మట్కా కేంద్రాన్ని తెరిచి బహిరంగంగానే సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటి నియంత్రణలో పోలీసుశాఖ విఫలమవుతుందనే విమర్శలు వస్తున్నాయి. మట్కా, పేకాట జోరుతో సామాన్య కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలో ని బళ్లారికి సరిహద్దుగా బొమ్మనహాళ్ ఉంటుంది. దీంతో బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, ఉంతకల్లు, గోనేహాళ్ క్రాస్ తదితర గ్రామాల్లో మట్కా వ్యాపారం జోరుగా సాగుతోంద న్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సరిహద్దు ప్రాంతాలను మట్కా ఏజెంట్లు అడ్డాగా చేసుకుని దందాను సాగిస్తున్నారు. రూ. 1కి రూ. 80 చొప్పున ఇస్తామని చెబుతుండటంతో సామాన్య ప్రజలు ఈ మహమ్మారి ఆటకు ఆకర్షితులవుతు న్నారు. దీంతో బళ్లారి, ఎత్తినబూదేహాళ్ నుంచి వచ్చిన ఏజెంట్లు గుట్టు చప్పుడు కాకుండా మట్కా నిర్వహిస్తున్నారు. మొదట మట్కా చీటీల ద్వారా నెంబర్లు కేటా యించి డబ్బులు వసూలు చేసుకుని ఏజెంట్లు వెళ్లిపోతారు. తర్వాత ఎవరి నెంబరు కు డబ్బులు వచ్చాయనే విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం ఇస్తుంటారు. మరి కొంతమంది ఏజెంట్లు స్థానికంగానే ఉంటూ రోజంతా మట్కాను కొనసాగిస్తున్నారు. ఎవరు గెలుచుకున్నారో వారికి డబ్బులు ఇచ్చేస్తూ మిగితావి ఏజెంట్ల దగ్గరే పెట్టుకుంటూ సామాన్యుడి జేబును ఖాళీ చేస్తున్నారు. అవసరమైతే స్థానికంగానే ఏజెంట్లు అప్పులు ఇచ్చి మరి సామాన్యులతో మట్కా ఆడిస్తూ మోసం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మట్కా బాధితులు అప్పుల పాలవుతూ రోడ్డున పడుతున్నారు. సరిహద్దులో జరుగుతున్న మట్కా వ్యాపారం ఎస్‌బీ అధికారులకు తెలిసినా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారని తెలుస్తోంది.

సరిహద్దులో మట్కా బంద్ చేయించండి

బొమ్మనహాళ్ సరిహద్దులో మట్కా వ్యాపారం జోరుగా సాగుతుందని బళ్లారి, అనంతపురం జిల్లాల ఎస్పీలు జోక్యం చేసుకుని మట్కా వ్యాపారాన్ని నియంత్రించాలని టీడీపీ నాయకుడు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ మహేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కణేకల్లుకు చెందిన ఓ వ్యక్తితో పాటు సరిహద్దులో ఉన్న మరికొందరు కలిసి మట్కా వ్యాపారం జోరుగా సాగిస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల యువకులు చెడు మార్గాన్ని ఎంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిహద్దులో జరుగుతున్న మట్కా అడ్డాలపై దాడులు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నిఘా పెడతాం: ప్రసాద్‌బాబు, సీఐ, రాయదుర్గంరూరల్

బొమ్మనహాళ్ సరిహద్దులో మట్కా అడ్డాలపై నిఘాపెట్టి చర్యలు తీసుకుంటాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని వదిలే ప్రసక్తే లేదు. మట్కా, పేకాట జూదం ఆడినా, నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం అందించాలి.

ముగిసిన ఎస్ఎస్ఎఫ్ సాహిత్యోత్సవం

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని మన్నీలా సమీపంలోని యాసీన్ కాలేజ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్‌లో ఎస్ఎస్ఎఫ్ (సున్నీ స్టూడెంట్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహిత్యోత్సవం ఆదివారంతో ముగిసింది. ఎస్ఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి సభ్యుడు అఫ్జల్ రషీద్‌కుత్బి ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హఫీజ్ కబీర్ నయిమి, సయ్యద్ మిద్లాజ్ ఖాదిరి, కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్‌సాబ్, స్వాలిహ్ అదాని పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి

సైకోను సాగనంపే రోజులు దగ్గరపడ్డాయ్: జేసీపీఆర్

యాడికి, ఫిబ్రవరి4: రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన సైకోను రాష్ట్రం నుంచి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పచ్చారుమేకలపల్లి, చందన లక్షుంపల్లి, కేశవ రాయునిపేట, దైవాలమడుగు గ్రామాల్లో ఆయన యువచైతన్య బస్సుయాత్రను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన సమస్యల గురించి స్థానిక ప్రజలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైకోపాలనలో రాష్ట్రంలో అభివృద్ధి అనే పదం లేకుండా పోయిందన్నారు. ప్రజల సమస్యలను సైకో గాలికి వదిలేశాడని మండిపడ్డారు. చంద్రబాబు విడుదల చేసిన మినీ మ్యానిఫెస్టోతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, జిల్లా స్పోక్స్‌పర్సన్ కులశేఖర్‌నాయుడు, శ్రీహరి, శ్రీనివాసులునాయుడు, ధనుంజయ, చలమారెడ్డి, రవికుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సాంబశివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నాగేంద్ర, సుధాకర్‌నాయుడు, సుబ్బారెడ్డి, మోపిరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో జేసీ ప్రభాకర్‌రెడ్డి మాటామంతి

దళారులను నమ్మవద్దు

రైతులను మోసగిస్తున్న దళారులను నమ్మవద్దని అరటి వ్యాపారులకు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బస్సుయాత్రలో భాగంగా ఆదివారం లక్షుంపల్లి గ్రామానికి వెళుతున్న సమయంలో అరటి వ్యాపారులు ఆయనకు ఎదురయ్యారు. వారితో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అరటి రైతులకు వ్యాపారులు సరైన ధర ఇస్తున్నా దళారులు రైతులను మోసగిస్తున్నా రన్నారు. రైతులు పండిస్తున్న అరటిపంటకు గిట్టుబాటు ధర ఇచ్చేలా దళారులను నియంత్రణ చేయాలని సూచించారు. రైతులు బాగుంటేనే గ్రామాలు బాగుంటాయని, రైతుల బాగు కోసం వ్యాపారులు కృషి చేయాలని ఆయన హితవు పలికారు.

అభివృద్ధి చేసేవారిని ఎన్నుకోండి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, ఫిబ్రవరి4: అభివృద్ధి కార్యక్రమాలను చేసే వారినే ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. యాడికిలోని అంబేడ్కర్‌కాలనీలో వార్డు మెంబరు నాగలక్షుమ్మ, మరో 50మంది, కొండకింద వీధిలో చాకలి వెంకటేష్, విశ్వనాథ్‌లతోపాటు మరో 40మంది, టీడీపీ కార్యాలయంలో పామిశెట్టి గోపితోపాటు మరో 40మంది టీడీపీలో చేరారు. వీరికి జేసీ అశ్మిత్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది టీడీపీ అన్నారు. తాము అధికారంలోకి రాగానే తాగునీరు, సాగునీటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి, తిరంపురం నీలకంఠ, ఆదినారాయణ, రాజశేఖర్‌నాయుడు, నారాయణస్వామి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, లక్ష్మణ్, విశ్వనాథ్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో జేసీ అశ్మిత్‌రెడ్డి

భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటన

తాడిపత్రి: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. భగత్‌సింగ్‌నగర్‌లో ఇంటింటికి తిరిగిన ఆయన ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట కౌన్సిలర్లు విజయ్‌కుమార్, షెక్షావలి, మల్లికార్జున, రేష్మాపర్వీన్ తదితరులు ఉన్నారు.

టీడీపీ విజయమే ధ్యేయం: ఉమా



కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 4: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ విజయమే మనందరి ధ్యేయంగా ముందడుగు వేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం బెంగళూరు టీడీపీ ఫోరమ్ సభ్యులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ కు సంబంధించిన కరపత్రాలను బెంగళూరు టీడీపీ ఫోరమ్ సభ్యులతో కలిసి ఉమామహేశ్వరనాయుడు విడుదల చేశారు. అనంతరం వారు సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయంపై చర్చించారు. ముఖ్యంగా ఎన్నికల్లో సోషల్ మీడియా, వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటి నుంచే గ్రామాల వారిగా వలస ఓటర్లను గుర్తించి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బెంగళూరు టీడీపీ ఫోరమ్ సభ్యులు తిమ్మప్ప, రాజు, నజీర్, బాలచంద్ర, రఘు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దొడగట్ట నారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి తలారి సత్యప్ప, మండల కన్వీనర్ శ్రీరాములు, పట్టణ ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి విరుపాక్షి, ఐ టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదిమూలం మంజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళలకు భవిష్యత్తు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న తెలుగు తమ్ముళ్లు

పామిడి, ఫిబ్రవరి 4: తెలుగుదేశం పార్టీతోనే మహిళలకు మంచి భవిష్యత్తు గ్యారెంటీ అని ఆ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు బొమ్మా మోహన్ కృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని 4, 10వ వార్డులలో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా దూసుకువెళ్తుందన్నారు. టీడీపీతోనే మహిళలకు భద్రత సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈడిగ సాధికార కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు గాదిలింగ, మాధవ, చీమలరాము, మస్తాన్, సర్వేష్, వెంకటరాముడు, సుంకప్ప, మాబు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

పామిడి, ఫిబ్రవరి 4: పట్టణంలోని సీతాపురం రైల్వే బ్రిడ్జి వద్ద రైలు ఢీ కొని వడ్డే ఎర్రిస్వామి(48) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అనంతపురం ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపిన మేరకు .. పట్టణంలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన వడ్డే లింగప్ప కుమారుడు వడ్డే ఎర్రిస్వామికి చిన్నప్పటి నుంచి మతిస్థిమితం లేదన్నారు. రోజూ ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ ఉంటాడన్నారు. మతిస్థిమితం లేక రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా మూడు రోజుల క్రితం రైలు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి బ్రిడ్జి కింద పడ్డాడన్నారు. ఎర్రిస్వామి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అంతలోనే రైల్వే సిబ్బంది బ్రిడ్జి కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడిఉందని చెప్పడంతో వెళ్లి చూడగా మృతుడిని ఎర్రిస్వామిని గుర్తించారు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లి వెంకటలక్ష్మి ఉన్నారు. అనంతపురం ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఈశ్వర్‌నాయక్, గుత్తి జీఆర్‌పీ కానిస్టేబుల్ వాసు కేసుపై విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పామిడి పట్టణానికి చెందిన రవి, రఫీ ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో ప్యాపిలికి వెళ్తుండగా వన్నేదొడ్డి గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలో పలు కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం , ఫిబ్రవరి 4: పట్టణంలోని 29వ వార్డులో ముప్పై కుటుంబాలు ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బైసీ శ్రీకాంత్‌తో పాటు ఆయన మిత్రులు కుటుంబికులు టీడీపీ మేనిఫెస్టో నచ్చడంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ మంజునాథ, కుర్ని సాధికార రాష్ట కన్వీనర్ టంకశాల హనుమంతు, కౌన్సిలర్ బుళ్ళారి జ్యోతి, పోరాళ్ళు పురుషోత్తం, పసుపులేటి నాగరాజు, గొడిసెలపల్లి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 4: మండలంలోని కొళగానహళ్లి గ్రామంలో సిద్ధప్పస్వామి ఆరాధన మహోత్సవాన్ని స్వామిజీ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ప్రొద్దుటూరు, మదనపల్లి, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి స్వామీజీలు, భక్తులు, శిష్యులు హాజరయ్యారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ ఏర్పడింది. స్వామివారి సంకీర్తన, హితబోధనలు, స్వామీజీ ప్రవచన పారాయణ, భజన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ఒకరి మృత్యువాత

కుందుర్పి, ఫిబ్రవరి 4: మండలంలోని అల్లాపురం గ్రామ సమీ పంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో యశ్‌పాల్ శర్మ (44) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు కర్ణాటక ప్రాంతం కుర్లకుంట గ్రామానికి చెందిన యశ్‌పాల్ శర్మ ద్విచక్రవాహనంపై బసాపురం బయల్దేరాడు. శెట్టూరు మండలం కనుకూరు గ్రామానికి చెందిన సురేష్ తన భార్య చిన్న కుమారుడితో కలిసి కుందుర్పిలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న తన పెద్దకుమారుడిని చూసేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అల్లాపురం మలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో యశ్‌పాల్ శర్మ తీవ్రంగా గాయపడగా సురేష్, అతడి భార్య, కుమారుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని 108లో కళ్యాణదుర్గం ఆస్పత్రికు తరలించారు. తీవ్రంగా గాయపడిన యశ్‌పాల్ శర్మను మెరుగైన వైద్యం కోసం కర్ణాటకలోని పరశురాంపురం ప్రభుత్వాస్పత్రికు తరలించారు. అక్కడి నుంచి చిత్రదుర్గం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుందుర్పి ఎస్ఐ వెంకటస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



యశ్‌పాల్ శర్మ (ఫైల్‌ఫొటో)

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గుత్తి, ఫిబ్రవరి4: గుంతకల్లు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన సునీత(23) విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. సునీత ఇంట్లో స్నానం చేసేందుకు వేడి నీటిలో నుంచి హీటర్‌ను తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీడిపల్లికి పెరిగిన ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 4: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో పెరిగింది. రిజర్వాయర్‌కు ఆదివారం ఇన్‌ఫ్లో 750 క్యూసెక్కులు ,ఔట్‌ఫ్లో 600 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 0.473 టీఎంసీలు నీటి నిల్వ ఉందన్నారు.

8న మండల సమావేశం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 4: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పద్మ అధ్యక్షతన జరగనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పౌరసరఫరా, రెవెన్యూ, పింఛన్లు, గృహనిర్మాణం, ప్రాథమిక విద్య, కుటుంబ సంక్షేమం, ప్రాథమిక ఆరోగ్యం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, ఉపాధిహామీ, స్త్రీ, శిశుసంక్షేమం, పశుపోషణ, విద్యుత్, రవాణా, అటవీ, వాటర్‌షెడ్లు, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 4: పట్టణంలో వినాయక సర్కిల్‌లో సోమవారం నిర్వహించే మాదిగల చైతన్య మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఈ మహాధర్నాకు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఉదయం 9 గంటలకు రాయదుర్గంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణకు అందరూ చేరుకోవాలన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

కుందుర్పి, ఫిబ్రవరి 4: ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు, వదాన్య జన సొసైటీ సంయుక్తంగా గత నెల 28వ తేదీన నిర్వహించిన టాలెంట్ టెస్టు విజేతలు 15 మందికి సోమవారం బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. దాదాపు 750 మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్ రాశారని, వారిలో నుండి ఉత్తమ ప్రతిభ కనబరచిన 15 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఉదయం 9.30కు కుందుర్పిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్ బాబు, ట్రస్టు ప్రతినిధులు టీ రాజు, లక్ష్మణమూర్తి, రఘువీర, బొమ్మలింగ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పామిడి, ఫిబ్రవరి 4: పట్టణంలోని షాదీఖానాలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆ ఆసుపత్రి వైద్యులు 250 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. ఉచిత శస్త్ర చికిత్సకు 110 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆయూష్ జిల్లా సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు వీసే జయరాంరావు, కిరణ్, సుహాస్, సురేష్, షేక్షావలి, మహేష్, గంగశేఖర్, ఆసుపత్రి ఆర్గనైజర్స్ శివకుమార్, లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరించి లొంగదీసుకోవడం మంచిది కాదు

రాయదుర్గం, ఫిబ్రవరి 4: ఇప్పటివరకు తమ వద్దకు రాలేదని నాయకులను బెదిరించి లొంగదీసుకోవడం మంచిదికాదని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో ఆదివారం జరిగిన నాలుగో విడత ఆసరా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ సమన్వయ కర్తగా ఉన్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి వద్దకు ఇప్పటివరకు కొందరు వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు వెళ్లకపోవడాన్ని పరోక్షంగా ఆయన ప్రస్తావించారు. వెళ్లని వారికి ఫోన్ చేసి రాకపోతే మీ వార్డులలో ఇన్‌చార్జులను పెడతామని హెచ్చరించి లొంగదీసుకోవడం మంచిదికాదన్నారు. భవిష్యత్‌లో ఎంతటి ఎమ్మెల్యే లైనా మాజీలు కాక తప్పదన్నారు. ఈ రోజు నాకు పట్టిన పరిస్థితి రేపు మీకు కూడా పడుతుందని తెలిపారు. ఉన్నంత కాలం అందరినీ కలుపుకుని పోవాల న్నారు. ఇక్కడ ప్రభుత్వం డబ్బుతో అభివృద్ధి చేశారు గానీ ఎవరూ సొంతంగా ఖర్చు పెట్టి చేయలేదన్నారు. ఆసరా కార్యక్రమానికి వచ్చిన మహిళలు ప్రసంగా లు వినకుండా తిరుగు ముఖం పట్టారు. దీంతో మున్సిపల్ ఆర్‌పీలు గేట్‌ల వద్ద ఉండి వారిని వెళ్లకుండా సమావేశంలో కూర్చోబెట్టేందుకు నానా అవస్థలు పడ్డారు. ఎంత ప్రయత్నం చేసినా మహిళలు వారి మాటలు వినకుండా ఇళ్లకు వెళ్లిపోయారు.



ఇళ్లకు వెళ్లిపోతున్న మహిళలు

కూడేరులో చోరీ

కూడేరు, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలో ఓ ఇంట్లో పట్టపగలే దొంగలు బంగారం చోరీ చేశారు. కూడేరులో నివాసముంటున్న యల్లమ్మ అనే మహిళ దుస్తుల దుకాణం పెట్టుకొని జీవిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దాదాపు ఐదు తులాల లాంగ్ చైన్ దొంగలించినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ఇంటిని పరిశీలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

శాంతిభద్రతలపై దృష్టి సారించండి: డీఎస్పీ

పామిడి, ఫిబ్రవరి 4: మండలంలో శాంతి భద్రతలపై దృష్టి సారించాలని గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని శాంతి భద్రతలపై ఆరా తీశారు. కేసులపై అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి విఘాతం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

యల్లనూరు, ఫిబ్రవరి4: మండలంలో ఆదివారం రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం 85నిట్టూరు, పెద్దమల్లేపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలపై ఏఎస్ఐ సంపత్‌తో కలిసి పరిశీలించారు.

మహిళ అదృశ్యం

యాడికి, ఫిబ్రవరి 4: మండలకేంద్రానికి చెందిన గాయత్రీ అదృశ్యమైందని ఆమె భర్త చౌడయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదుచేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గాయత్రీ భర్తతో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఆమెకోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేదన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న జగన్ ప్రభుత్వం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 4: నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం నిలువునా మోసం చేస్తోందని టీఎన్‌ఎస్‌ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లింగరాజుయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి వస్తే ప్రతి సంత్సరం జాబ్ క్యాలెండర్ అని చెప్పి 58 నెలల తరువాత నిరుద్యోగులను మరోసారి మభ్య పెట్టేందుకు డీఎస్సీ అంటూ మోస పూరిత ప్రకటన చేస్తున్నారని విమర్శించారు.

స్వల్ప ఘర్షణ- కేసు నమోదు

యల్లనూరు, ఫిబ్రవరి4: మండలంలోని చిలమకూరు గ్రామంలో అన్నదమ్ముల మధ్య స్వల్ప ఘర్షణ జరగడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. పెద్ద లింగమయ్య, చిన్న లింగమయ్యల మధ్య పొలం విషయంలో తగాదా ఉండేది. ఆదివారం ఇద్దరూ గొడవ పడటంతో కేసు నమోదు చేశామన్నారు.

సరిహద్దు కేంద్రంగా జోరుగా మట్కా

రోడ్డున పడుతున్న సామాన్య కుటుంబాలు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 4: మండలంలో మట్కా జోరుగా సాగుతోంది. సరిహద్దుతో పాటు గ్రామాలలో మట్కా ఏజెంట్లు రూ. లక్షల్లో దందా సాగిస్తున్నారు. గతం లో ఈ దందాను రహస్యంగా సాగించేవారు. ప్రస్తుతం సరిహద్దుల్లో మట్కా కేంద్రాన్ని తెరిచి బహిరంగంగానే సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటి నియంత్రణలో పోలీసుశాఖ విఫలమవుతుందనే విమర్శలు వస్తున్నాయి. మట్కా, పేకాట జోరుతో సామాన్య కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి సరిహద్దుగా బొమ్మనహాళ్ ఉంటుంది. దీంతో బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, ఉంతకల్లు, గోనేహాళ్ క్రాస్ తదితర గ్రామాల్లో మట్కా వ్యాపారం జోరుగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సరిహద్దు ప్రాంతాలను మట్కా ఏజెంట్లు అడ్డాగా చేసుకుని దందాను సాగిస్తున్నారు. రూ. 1కి రూ. 80 చొప్పున ఇస్తామని చెబుతుండటంతో సామాన్య ప్రజలు ఈ మహమ్మారి ఆటకు ఆకర్షి తులవుతున్నారు. దీంతో బళ్లారి, ఎత్తినబూదేహాళ్ నుంచి వచ్చిన ఏజెంట్లు గుట్టు చప్పుడు కాకుండా మట్కా నిర్వహి స్తున్నారు. మొదట మట్కా చీటీల ద్వారా నెంబర్లు కేటాయించి డబ్బులు వసూలు చేసుకుని ఏజెంట్లు వెళ్లిపోతారు. తర్వాత ఎవరి నెంబరుకు డబ్బులు వచ్చాయనే విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం ఇస్తుంటారు. మరి కొంతమంది ఏజెంట్లు స్థానికంగానే ఉంటూ రోజంతా మట్కాను కొనసాగిస్తున్నారు. ఎవరు గెలుచుకున్నారో వారికి డబ్బులు ఇచ్చేస్తూ మిగితావి ఏజెంట్ల దగ్గరే పెట్టుకుంటూ సామాన్యుడి జేబును ఖాళీ చేస్తున్నారు. అవసరమైతే స్థానికంగానే ఏజెంట్లు అప్పులు ఇచ్చి మరి సామాన్యులతో మట్కా ఆడిస్తూ మోసం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మట్కా బాధితులు అప్పుల పాలవుతూ రోడ్డున పడుతున్నారు. సరిహద్దులో జరుగుతున్న మట్కా వ్యాపారం ఎస్‌బీ అధికారులకు తెలిసినా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారని తెలుస్తోంది.

సరిహద్దులో మట్కా బంద్ చేయించండి

బొమ్మనహాళ్ సరిహద్దులో మట్కా వ్యాపారం జోరుగా సాగుతుందని బళ్లారి, అనంతపురం జిల్లాల ఎస్పీలు జోక్యం చేసుకుని మట్కా వ్యాపారాన్ని నియంత్రించాలని టీడీపీ నాయకుడు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ మహేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కణేకల్లుకు చెందిన ఓ వ్యక్తితో పాటు సరిహద్దులో ఉన్న మరికొందరు కలిసి మట్కా వ్యాపారం జోరుగా సాగిస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల యువకులు చెడుమార్గాన్ని ఎంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిహద్దులో జరుగుతున్న మట్కా అడ్డాలపై దాడులు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నిఘా పెడతాం: ప్రసాద్‌బాబు, సీఐ, రాయదుర్గంరూరల్

బొమ్మనహాళ్ సరిహద్దులో మట్కా అడ్డాలపై నిఘాపెట్టి చర్యలు తీసుకుంటాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని వదిలే ప్రసక్తే లేదు. మట్కా, పేకాట జూదం ఆడినా, నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం అందించాలి.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష

గుత్తి,ఫిబ్రవరి4: పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు నిర్వహించారు. దాదాపు 400 మంది విద్యార్థులు మోడల్ పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్, నాయకులు లక్ష్మీప్రసాద్, కిరణ్‌కుమార్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి4: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఓట్ ఫర్ ఓపీఎస్ అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజకీయపార్టీలు మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానం హామిని ఇచ్చే విధంగా ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శేఖర్, ఉమాపతి, జయరాములు, రఘు, సంజప్ప, నాగరాజు, మల్లికార్జున, వేణు, ఇస్లాంబాషా, శ్రీధర్, సుధాకర్ పాల్గొన్నారు.

9న ఆరాధన మహోత్సవం

పుట్లూరు, ఫిబ్రవరి4: మండలంలోని ఎస్. తిమ్మాపురం గ్రామంలో ఈనెల 9న అవధూత నిరంజన గురు రంగనాథస్వామి ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. స్వామివారి గ్రామోత్సవం, అనంతరం భజన, చింతామణి నాటకం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

హిందీలో సన్‌షైన్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి4: దశమాందం విద్యా సేవా సదన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన హిందీ ప్రతిభా పరీక్షలో పట్టణంలోని సన్‌షైన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించారని కరస్పాండెంట్ లక్ష్మీకుమార్ ఆదివారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడంతో విద్యార్థులను తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనాల తనిఖీ

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 4: మండలంలోని చింతలపల్లి గ్రామం వద్ద ఆదివారం ఎస్ఐ శరత్‌చంద్ర వాహనాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా సరైన రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు



డీఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి4: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో నూతన డీఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన శివ భాస్కర్‌రెడ్డిని ఆదివారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీకి పూలబొకేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీని కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పవన్‌కుమార్‌గౌడ్, నాయకులు కేశప్ప, తలారి మస్తానప్ప, రామన్నచౌదరి, హనమంతు, ఫజులు, వీకేసీ గోపాల్, నందీశ్వర్, సుధాకర్, నవీన్ పాల్గొన్నారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ, ఫిబ్రవరి 4: మండలంలోని ఓ గ్రామంలో ఇద్దరు ఆదివారం వ్యవసాయ పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించారు. గతంలో వీరిద్దరూ ప్రేమించుకున్నారు. మూడేళ్ల క్రితం వీరి ప్రేమవ్యవహారంపై పెద్దలు పంచాయితీ చేశారు. ఇద్దరికీ వేర్వేరుగా పెళ్లిళ్ల అయ్యాయి. మూడు రోజుల క్రితం మహిళ ఆ గ్రామానికి వచ్చింది. ప్రేమ వల్ల ఇబ్బందులు, గొడవలు వస్తున్నాయని పాత ప్రేమికుడితో చెప్పుకుని బాధపడింది. దీంతో మనస్తాపం చెందిన ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అపస్మారక స్థితిలో పడిఉన్న వారిని స్థానికులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపైన ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అశ్వత్థంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి

పెద్దపప్పూరు, ఫిబ్రవరి4: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రమైన అశ్వత్థ నారాయణస్వామి, శ్రీ చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పుష్య మాసం పురస్కరించుకొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు.

నేడు రాయలసీమ వివక్ష నవల పరిచయ సభ

రాయదుర్గంటౌన్, ఫిబ్రవరి 4: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మధ్యాహ్నం రాయలసీమ వివక్ష నవల పరిచయ సభను నిర్వహిస్తున్నట్లు కథ, నవల రచయిత శాంతినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. రచయితగా తన ఎదుగుదలకు రాయదుర్గం ప్రాంతం ఎంతో సహాయ పడిందన్నారు. తాను పనిచేసిన కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమానికి బండి నారాయణస్వామి, నాగేశ్వరాచారి, ఉప్పరపాటి వెంకటేశులు తదితరులు పాల్గొంటారని తెలిపారు.